క్లుప్తంగా


ఆంగ్ల భాషపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు విద్యార్థులకు ఇంగ్లిష్‌లోని పలు అంశాలను నేర్పించారు. విద్యార్థులందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాత నగర్లోని సూర్య నారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ పండగ రేపు

ఎస్ఆర్ పురంలో తొలేళ్ల సంబరం నేడు



కనకదుర్గమ్మ

పెందుర్తి: మండలంలోని సౌభాగ్యరాయపురం(ఎస్ఆర్ పురం)లో కొలువైన కనకదుర్గమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆదివారం తెలిపారు. ఉత్సవంలో భాగంగా సోమవారం సాయంత్రం తొలేళ్ల సంబరం, దేవరను తీసుకురానున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేయనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మారువారం పండగ సందర్భంగా ఈ నెల 27న అమ్మవారికి భారీ ఎత్తున సారె సమర్పించనున్నట్లు వెల్లడించారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

చదువంటే మాకిష్టం..



పుస్తకపఠనంలో విద్యార్థులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని ఉల్లాసంగా.. ఉత్సాహంగా నిర్వహించారు. పుస్తకం పఠనం వల్ల కలిగే లాభాలను రీసోర్స్‌పర్సన్లు పాలెపు బంగారుచిట్టి, కేఎస్ఆర్ మూర్తి వివరించారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకుని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తతో ఇబ్బందులు



కాలనీలో పేరుకుపోయిన చెత్త

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో రోడ్లపై పేరుకుపోతున్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించని కారణంగా దోమల బెడద పెరిగిపోయింది. కాలనీ వాసులు ఊడ్చిన చెత్తను రోడ్లపై కుప్పలుగా వేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ఈ చెత్తను నిర్దిష్ట సమయంలో తొలగించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. పేరుకుపోతున్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రసాయన వ్యర్థాలపై ఫిర్యాదు

పరవాడ: మొల్లేటి గెడ్డలో రసాయన వ్యర్థజలాలను విడుదల చేసిన ఫార్మా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం వర్షం పడుతుందన్న ఉద్దేశ్యంతో ఎవరి కంట పడకుండా వ్యర్థ రసాయనాలను విడుదల చేశారన్నారు. దీనిపై అనకాపల్లి జిల్లా కలెక్టర్‌తోపాటు, స్థానిక తహసీల్దార్, పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పల్లెల్లో తిరగవు.. బీఆర్‌టీఎస్‌పై ఆగవు

ఆర్టీసీ అధికారుల తీరుతో పెందుర్తి ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్థికంగానూ నష్టపోతున్నారు. అవసరం ఉన్న చోట బస్సులు తిప్పకపోవడం, ఆగాల్సిన చోట బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తీవ్ర రద్దీ ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో అవసరమైన మేరకు బస్సుల్ని నడపకపోవడంతో.. అధికారుల తీరుపై మండిపడుతున్నారు.



పెందుర్తి కూడలి వద్ద బస్ ఎక్కేందుకు విద్యార్థుల పాట్లు

- నియోజకవర్గ పరిధిలో ప్రధాన గ్రామాలకు నిలిచిన ఆర్టీసీ సేవలు
- జీవీఎంసీ పరిధిలోనూ ముఖ్య ప్రాంతాలకు వెళ్లని బస్సులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు



పెందుర్తి నుంచి ఆనందపురం వైపు కిక్కిరిసిన బస్సులో వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో బస్ షెల్టర్ లేక ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పెందుర్తి: నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతం నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు నగరానికి ప్రయాణాలు సాగిస్తున్నారు. వందలాది రూపాయలు పోసి బస్ పాస్‌లు కొనుక్కుంటున్నారు. కానీ సమయానికి బస్సులు రాకపోవడంతో బస్టాప్లోనే పడిగాపులు కాస్తున్నారు. పల్లె ప్రజల పరిస్థితి ఇలా ఉంటే పట్టణ/నగర వాసులది మరీ దారుణ పరిస్థితి. అనేక బస్సులు తమ కళ్లముందు నుంచి వెళ్లిపోతున్నా ఏమీ చేయలేకపోతున్నారు. ఆపాల్సిన చోట ఆపకపోవడం, ఒకవేళ ఆపినా.. బస్సులో ఎక్కేందుక్కూడా వీల్లేనంతగా కిక్కిరిసి ఉండటమే ఇందుకు కారణం.

ఉన్నవి కూడా తీసేశారు!

పెందుర్తి మండలంలో ఒకప్పుడు ప్రతి గ్రామానికీ కనీసం ఒక్క ఆర్టీసీ బస్సు అయినా నడిచేది. దీంతో ఆర్థిక భారం తగ్గడంతో పాటు రవాణా సౌలభ్యం కూడా ఉండేది. ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర వ్యాపకాలతో బయటకు వెళ్లే వారికి ఆర్టీసీ బస్సులు చాలా సౌకర్యంగా ఉండేవి. అయితే గత కొంత కాలంగా గ్రామాల్లో తిరుగుతున్న బస్సుల్లో ఒక్కొక్కటిగా సర్వీసుల్ని నిలిపేస్తున్నారు. నియోజకవర్గంలోని పెందుర్తి గ్రామీణ ప్రాంతంతో పాటు సబ్బవరం, పరవాడ పల్లె ప్రాంతాలకు అనేక సర్వీసులు ఆపేశారు. ఒకటి రెండు చోట్లకు బస్సులను తిప్పుతున్నా అవి ఎప్పుడు వస్తాయో? ఎప్పుడు వెళతాయో? అధికారులకే తెలియదు.

విద్యార్థులదీ అదే వ్యథ



బస్సులు తగినన్ని లేక అత్యంత ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

మరోవైపు పెందుర్తి నుంచి ఆనందపురం కొమ్మాది, భీమిలి ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. **కొందరు ఆయా విద్యా సంస్థలకు** చెందిన **బస్సుల్లో వెళుతున్నారు.** చాలా మంది **విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే** ప్రయాణం చేస్తున్నారు. **ఉదయం పూట కేవలం** రెండు ట్రిప్‌లు **మాత్రమే బస్‌లు తిరుగుతున్నాయి.** దాదాపు **వెయ్యి మందికి పైగా ఒకేసారి** ప్రయాణం చేసే **సమయంలో కేవలం ఒకటి** రెండు ఆర్టీసీ **బస్సులు వారిలో 10 శాతం మం**దికి కూడా **చాలడం లేదు. బస్సులు** ఉంటాయన్న **నమ్మకంతో నెలనెలా బస్ పాస్‌లు** తీసుకున్నా, **వాటి వలన ప్రయోజనం లేదని** విద్యార్థులు **వాపోతున్నారు.**

ఒక్క బస్సూ ఆగదు...

పెందుర్తి నుంచి గోపాలపట్నం వరకూ ఉన్న **ప్రజలది మరో వ్యథ. ఆర్డినరీ, ఎక్స్**ప్రెస్, మెట్రో **సర్వీసుల పేరుతో అనేక బస్సులు** నడుపుతున్నారు. **ప్రధాన కూడళ్లలో తప్ప** మరే ఇతర కూడళ్లలో మెట్రో సర్వీసులు ఆగట్లేదు. పెందుర్తి జూనియర్ కళాశాల, చినముషిడివాడ, సుజాతనగర్, కృష్ణరాయపురం, నాయుడుతోట, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు కోరినా బస్సులు ఆపడంలేదు. పోనీ ఆర్డినరీ బస్సులైనా వస్తాయనుకుంటే వాటి సంఖ్య బాగా తగ్గించేశారు. దీంతో ప్రయాణికులంతా తప్పనిసరి స్థితిలో ఆటోలను, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

పాస్‌లు తీసుకున్నా ప్రయోజనం లేదు



నేను నగరంలో చదువుతున్నా. కళాశాలకు వెళ్లి, రావడానికి బస్‌పాస్ తీసుకున్నా. కానీ మా ఊరి నుంచి పెందుర్తి రావడానికి ఆటోనే గతి. పెందుర్తి వచ్చాక కూడా బస్‌లు ఖాళీగా ఉండట్లేదు. దీంతో ఇక్కడి నుంచీ చాలాసార్లు ఆటోలోనే వెళ్లాల్సి వస్తోంది. దీంతో బస్ పాస్ ఎందుకో మాకే తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి అదనంగా బస్సులు నడపాలి.

– జి.కావ్య, ఇంటర్ విద్యార్థి, జుత్తాడ

ఆ బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలి



రద్దు చేసిన అనకాపల్లి–ముత్యాలమ్మపాలెం బస్సును పునరుద్ధరించాలి. అనకాపల్లిలో కోర్టు, ఇతర లావాదేవీల కోసం రాకపోకలు సాగించేవారు బస్సుల్లేక ఇబ్బంది పడుతున్నారు. చేపల చిరు వ్యాపారులు కూడా తప్పని స్థితిలో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. వెంటనే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– మునలయ్య, ముత్యాలమ్మపాలెం

వర్సిటీలకు అనుసంధానిస్తూ నడపాలి



మా ప్రాంతంలో మారిటైం, పెట్రో యూనివర్సిటీలు ఉన్నాయి. దీంతో పాటు అనేక మంది చిరు వ్యాపారులు, రైతులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సబ్బవరం నుంచి వంగలి మీదుగా ఆర్టీసీ బస్‌లు నడిపితే ఈ ప్రాంతం వాసులకు ఎంతో ఉపయోగం. గతంలో కూడా చాలాసార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. ఇప్పటికైనా స్పందించి బస్‌లు నడపాలి.

– జెట్టి హేమంత్‌కుమార్, వంగలి

తల్లిని కుమారుడి చెంతకు చేర్చిన పోలీసులు



మర్రి బందోను కుమారుడికి అప్పగిస్తున్న పీసీ చంద్రశేఖర్

పెందుర్తి: ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయిన ఓ మహిళను పెందుర్తి పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. దాదాపు మూడు నెలల పాటు అనాథగా ఓ ఆశ్రమంలో ఆశ్రయం పొందిన ఆమె.. ఎట్టకేలకు పోలీసుల చొరవతో తన కుటుంబాన్ని చేరగలిగింది. వివరాలివి.. అల్లూరిసీతారామరాజు జిల్లా అరకు ప్రాంతానికి చెందిన మర్రి బందో(45) ఫిబ్రవరి 18న పని నిమిత్తం ఇంటి నుంచి నగరానికి వచ్చింది. ఆమెకు మానసిక సమస్య ఉండడంతో తిరిగి ఎలా వెళ్లాలో తెలియక, పెందుర్తి సమీపంలోని గొల్లవిల్లివానిపాలెం పరిసరాల్లో దిక్కుతోచని స్థితిలో తిరిగింది. ఈ క్రమంలో స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. అయితే ఆమె తన వివరాలు సరిగా చెప్పలేకపోవడంతో అనాథగా భావించి పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు.

మూడు నెలల తరువాత..

అయితే పోలీసులు తమ ప్రయత్నం విరమించకుండా బందో స్వగ్రామం, కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. ఆమె ఫొటోను ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపారు. ఈ క్రమంలో ఆమెది అరకు ప్రాంతంగా గుర్తించి అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమె ఇంటిని కనుగొన్నారు. బందో కుమారుడు మర్రి కామేశ్వరరావును ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు రప్పించి ఆమెను అప్పగించడంతో ఆ తల్లి కథ సుఖాంతమైంది.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దేముడునాయుడు

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ దేముడునాయుడు అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మీ చెడు ప్రవర్తన కారణంగా మీ కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవుతాయని, ఆ నరకం ఆ కుటుంబ సభ్యులనే అడిగి తెలుసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం



సమావేశం అనంతరం పార్టీ స్థానిక నాయకులతో సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పార్టీ శ్రేణులతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అదీప్‌రాజ్

సబ్బవరం: వైఎస్సార్‌సీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. వెదుళ్లనరవలో పార్టీ ముఖ్య నేతలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ సూపర్ సిక్స్ అమల్లో ప్రజలను మోసగించిన తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసినవారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులకు నిరంతరం అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సర్వసిద్ధి బోరయ్య, బొట్టా ముత్యాలు, చట్టి తాతారావు, చొప్ప అప్పలనాయుడు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, చొప్ప అనిల్, చట్టి అప్పలరాజు, పల్ల చిన్న, చొప్ప కనకరాజు, వియ్యపు తాతారావు, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు



మేహాద్రి సమీపంలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను డ్రోన్ ద్వారా గుర్తించి, కేసులు రాస్తున్న పోలీసులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురిపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో మేహాద్రిగెడ్డ, నాయుడుతోట, వేపగుంట ప్రాంతాల్లో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ప్రమాదకరంగా ఈత కొడుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి, అక్కడి నుంచి పంపేశారు. ఈ క్రమంలో మద్యం సేవిస్తూ దొరికన 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వరంబాబును పరామర్శించిన మజ్జి శ్రీనివాసరావు



ఆస్పత్రిలో ఎర్ర వరహానరసింహంను పరామర్శిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

సింహాచలం: ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 98వ వార్డు పరిధి అడవివరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్ర వరహానరసింహం(వరంబాబు)ను ఆ పార్టీ భీమిలి నియోజకర్గం ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. నగరంలోని ఆరాధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వరంబాబును కలిసి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని, త్వరగా కోలుకుని మళ్లీ పార్టీకి సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులను పలకరించి, ధైర్యం చెప్పారు. మజ్జి శ్రీనివాసరావు వెంట పార్టీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు మజ్జి వెంకటరావు, దాము ఉన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు నెలవులు



పెదముషిడివాడలో ప్రమాదకరమైన మలుపు



పరవాడ-భర్నికం రహదారిలో ప్రమాదకర మలుపు

పరవాడ: మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు సాగించే రహదారులపై రోడ్డు మలుపులు ప్రయాణికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ఈ రోడ్లపై రాకపోకలు సాగించే వాహనచోదకులు తమ ముందున్న రోడ్డు మలుపులను గుర్తించలేక ప్రమాదాలకు గురై, మృత్యువాత పడుతున్నారు.

- లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో పెదముషిడివాడ వద్ద గల మలుపు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతుంది. మలుపు వద్ద బహుళ అంతస్తుల నిర్మాణాలు అడ్డంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను ప్రయాణికులు గుర్తించడం సాధ్యపడట్లేదు. ఈ రోడ్డు బూడిద లారీలు, బొగ్గు లారీలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఒక్కసారిగా మలుపు తిరగాల్సి రావడంతో భారీ వాహనాలను గుర్తించలేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- పరవాడ-భర్నికం రహదారిలో పరవాడ శ్మశానం వద్దనున్న మలుపు కూడా ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తుంది. రోడ్డు పక్కన గల భారీ వృక్షాలు వలన మలుపులో ముందు వెనుక వచ్చే వాహనాలను గుర్తించడం కష్టంగా ఉంటుంది. ఇటీవల భర్నికం గ్రామానికి చెందిన ఇరువురు యువకులు ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి మలుపులో అదుపుతప్పి పల్టీలు కొట్టిన ప్రమాదంలో మృత్యువాత పడ్డారు.
- వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలో 11 మలుపులు ప్రమాదకరంగా మారాయి. ముత్యాలమ్మపాలెం తీరానికి రాకపోకలు సాగించే సందర్శకులతో పాటు సాధారణ ప్రయాణికులు తరచూ ఈ మలుపుల్లో ప్రమాదాలకు గురవుతున్నారు.
- పరవాడ పోలీస్ స్టేషన్ వద్ద మలుపు కూడ అతి ప్రమాదంగా మారింది. పోలీస్ స్టేషన్‌లో ఏపుగా పెరిగిన చెట్లతో మలుపు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.
- దేశపాత్రునిపాలెం వద్దనున్న మలుపు కూడా ప్రమాదాల నిలయంగా ఉంది. పరవాడ ఎర్రకోనేరు వద్ద మలుపు, వాడచీపురుపల్లి–దీపాంజలినగర్ రహదారిలో గొల్లపేట వద్దనున్న మలుపులు ప్రయాణికులను వేధిస్తున్నాయి.

ప్రమాదకరమైన మలుపులను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన రోడ్డు భవనాల శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం వలన తరచూ గ్రామీణ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదకరమైన మలుపులు వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. కార్మికనగర్, అప్పలనర్సయ్యనగర్, చైతన్యనగర్ ప్రాంతాల్లో పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా గోపాలపట్నం సీపీఎం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ పుచ్చలపల్లి జీవితమంతా పేద, బడుగు ప్రజల అభ్యున్నతి కోసమే పోరాటం చేశారన్నారు. తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నేతగా ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించారని కొనియాడారు. నిరాడంబరంగా సాగిన పుచ్చలపల్లి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకట్రావు, జోన్ కమిటీ సభ్యులు శంకర్రావు, వెంకటలక్ష్మి, రామారావు, గోపి, ప్రభు, ఈశ్వరరావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో ముగిసిన శ్రీవిద్య శిక్షణ



శిక్షణలో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన శ్రీవిద్య ఉపాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ నిర్వహించిన శ్రీవిద్య మిడ్‌లెవెల్ కోర్సు ఆదివారంతో ముగిసింది. ప్రాథమిక స్థాయి శిక్షణ పూర్తి చేసుకుని, వచ్చిన దేశ, విదేశాలకు చెందిన శ్రీవిద్య ఉపాసకులను ఈ శిక్షణ అనంతరం గురుమాత అన్నపూర్ణమ్మ ఆశీర్వదించారు. కుల మత భేదాల్లేకుండా ఇటువంటి బ్రహ్మ విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలన్న ఆలోచనతో నేర్పిస్తున్న ఈ విద్య ఎక్కడికి వెళ్లినా, వారితో పాటు అందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు కందర్ప రమ తదితరులు పాల్గొన్నారు.